TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక




సంపుటి : 3 | సంచిక : 280 | సోమవారం 3 ఫిబ్రవరి 2025 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper



# వసంత పంచమి వేళ మరింత రద్దీ

**మహాకుంభమేళా నేపథ్యంలో వసంత పంచమి నాడు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. మౌని అమావాస్య రోజున చోటుచేసుకున్న తొక్కిసలాటతో అప్రమత్తమైన యూపీ సర్కార్.. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఎటువంటి తప్పిదం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి ప్రభుత్వం.. సీనియర్ ఐఏఎస్‌లను రంగంలోకి దింపింది.**

జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రయాగ్‌రాజ్‌లో సుమారు 33కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం అంచనా వేసింది. శనివారం 2.15కోట్ల మంది రాగా.. ఆదివారం మధ్యాహ్నం 12గంటల వరకే 90లక్షల మంది భక్తులు స్నానాలు ఆచరించినట్లు తెలిపింది. వసంత పంచమి పురస్కరించుకొని సోమవారం 4 నుంచి 6కోట్ల మంది రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కుంభమేళాకు ప్రముఖుల తాకిడి కూడా పెరుగుతోంది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌కు వచ్చివెళ్లగా.. ఫిబ్రవరి 5న ప్రధాని మోదీ రాక కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

మౌని అమావాస్య రోజున కోట్లాది మంది ప్రయాగ్‌రాజ్ రావడం, సెక్టార్ 2లో జరిగిన తొక్కిసలాటలో 30 మంది చనిపోయిన నేపథ్యంలో క్రౌడ్ మేనేజిమెంట్‌పై అధికారులు మరింత దృష్టి సారించారు. 2019లో అర్ధ కుంభమేళా సమయంలో పనిచేసిన ఐఏఎస్ అధికారులు అశీష్ గోయల్, భానుచంద్ర గోస్వామిలను రంగంలోకి దించారు. వీరిద్దరు మేళా అధికారి విజయ్ కిరణ్ ఆనంద్‌తో కలిసి పని చేయనున్నారు.

అదనపు డీజీపీ భాను భాస్కర్ కూడా రద్దీ నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం ఘాట్‌లను పరిశీలించిన ఆయన.. స్నానాల తర్వాత ఘాట్‌ల వద్ద కాలక్షేపం చేయవద్దని సూచించారు. ఇతరుల కోసం ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయాలని, ఘాట్‌ల వద్ద భోజనాలు చేయవద్దని చెబుతున్నారు. విశ్రాంతి కోసం భక్తులు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లాలని మైక్‌లలో ప్రకటనలు చేశారు.(ఇదిలాఉంటే, కుంభమేళా సమయంలో సంక్రాంతి, మౌని అమావాస్య, వసంత పంచమిలను పవిత్ర రోజులుగా భావిస్తారు. వీటితోపాటు మాఘ పూర్ణిమ (ఫిబ్రవరి 12), మహా శివరాత్రి (ఫిబ్రవరి 26) రోజుల్లోనూ అమృత స్నానం ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే అవకాశం ఉంది.

- తెలుగు న్యూస్ టైమ్స్



## ఒక్క అవకాశం ఇవ్వండి.. ఢిల్లీని అత్యుత్తమ రాజధానిగా మారుస్తాం

**ఢిల్లీ:** దేశరాజధాని ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. శనివారం ఢిల్లీలోని ముస్తాఫాబాద్ నియోకవర్గంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తూ ఆప్ పదేళ్ల పాలనపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఢిల్లీలో 3జీ (మోసపూరిత ప్రభుత్వం, చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించే ప్రభుత్వం, అవినీతి ప్రభుత్వం) నడుస్తోందని, ఎన్నికల్లో ఆ పార్టీని చీపురుతో ఊడ్చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజల డబ్బుతో రూ.కోట్ల విలువ చేసే ఇల్లు నిర్మించుకున్నారు. రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారు. ఢిల్లీని చెత్త కుప్పలా మార్చేశారు. వర్షాలు వస్తే.. ఢిల్లీ ఓ మురికినీటి సరస్సుగా మారుతోంది. దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పుడు ఆప్ పాలన నుంచి, మద్యం మాఫియా నుంచి ఢిల్లీ ప్రజలను విముక్తి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. నిజాయితీ లేని వ్యక్తుల్ని తరిమికొట్టాల్సిన సమయమిది. ఈసారి మోదీకి ఒక అవకాశం ఇవ్వండి. ఐదేళ్లలో ప్రపంచంలోనే ఉత్తమ రాజధాని నగరంగా ఢిల్లీని తీర్చిదిద్దుతాం" అని అమిత్‌షా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

## అమెరికన్లు ఆ భారం మోయక తప్పదు

కెనడా, మెక్సికో, చైనా నుంచి దిగుమతులపై సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇది ప్రతీకార చర్యలకు కారణమవడంతోపాటు ధరలు కూడా పెరిగే ప్రమాదముందనే హెచ్చరికల నేపథ్యంలో అధ్యక్షుడు స్పందించారు. వాణిజ్య భాగస్వామ్య దేశాలపై సుంకాల పెంపుదలతో అమెరికన్లు ఆర్థిక భారం మోయాల్సి రావచ్చని అన్నారు. అయినప్పటికీ విషయంలో తప్పక ప్రతిఫలం లభిస్తుందన్నారు. అమెరికాను మళ్లీ గొప్పగా మారుస్తానంటూ సొంత సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్టు పెట్టారు. తాను అధికారంలోకి వస్తే వాణిజ్య లోటు ఉన్న దేశాలపై సుంకాలు విధిస్తానని చెబుతోన్న ట్రంప్.. కెనడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం, చైనాపై 10 శాతం సుంకాల అమలుకు సంతకం చేశారు. అమెరికన్లను రక్షించాల్సిన అవసరం ఉందన్న ఆయన.. అందరికీ భద్రత కల్పించడం అధ్యక్షుడిగా తన బాధ్యత అన్నారు. చట్టవిరుద్ధ వలసదారులను, మాదక ద్రవ్యాలు



తమ సరిహద్దుల్లోకి రాకుండా చేస్తానని ఎన్నికల ప్రచారంలో మాట ఇచ్చానని, దానికి కట్టుబడి ఉన్నానని చెప్పారు. అయితే, ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ప్రతీకార చర్యలకు కెనడా మెక్సికో దేశాలు ఉపక్రమించాయి. అందులో భాగంగా 155 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై 25 శాతం సుంకం విధిస్తునట్లు జస్టిన్ ట్రూడో ప్రకటించారు. మెక్సికో సైతం ఇలాంటి చర్యలకు సిద్ధమైంది. తాము కూడా అమెరికా దిగుమతులపై టారిఫ్‌లు విధిస్తామని ఆ దేశ అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ పేర్కొన్నారు. దీంతో అమెరికన్లపై పన్ను భారం పడవచ్చని ట్రంప్ పేర్కొన్నారు.



# ఘనంగా ప్రకాశం జిల్లా 56వ అవతరణ దినోత్సవ వేడుకలు

**ఒంగోలు:** ప్రకాశం జిల్లా 56వ అవతరణ దినోత్సవ వేడుకలు ఆదివారం ఒంగోలు ప్రకాశం భవనంలో ఘనంగా నిర్వహించబడాయి. ముందుగా కలెక్టరేట్ ఆవరణలోని ప్రకాశం పంతులు విగ్రహానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ డోల బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియాశాసనసభ్యులు, శ్రీ దామచర్ల జనార్ధన్ రావు (ఒంగోలు), శ్రీ బి.ఎన్. విజయ్ కుమార్ (సంతనూతలపాడు), రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ శ్రీ దామచర్ల సత్యనారాయణ, మాల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ పి. విజయ్ కుమార్, రాష్ట్ర వ్యవసాయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ శ్రీ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వీరు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. పర్యాటక అభివృద్ధిపై నూకసాని బాలాజీ ప్రకటన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ, ప్రకాశం పంతులు స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. తీరప్రాంతాలు, సందర్శనీయ ప్రదేశాలను అభివృద్ధి చేసి పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. జిల్లా ఏర్పాటులో రోడ్డ నారప రెడ్డి, అప్పటి సీఎం కాసు బ్రహ్మానంద రెడ్డి చేసిన కృషిని స్మరించుకున్నారు. సత్కారాలు & సాంస్కృతిక కార్యక్రమాలు స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను & ప్రతిభ కనబరిచిన వారిని సత్కరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాల్గొన్న అధికారులు కార్యక్రమంలో డిఆర్ఓ బి. చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డిఓ శ్రీమతి లక్ష్మీ ప్రసన్న, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.







నూతన వధూవరులైన టి.ప్రశాంత్ డి.నందిని వివాహ కార్యక్రమం చెన్నైలోని ఈసిఐ గాంధీనగర్, కన్నడ పాలెం చర్చ్ చెందిన దైవ సేవకులు రెవ వి. జీవరత్నం ఆధ్వర్యంలో జరిగిన ఈ వివాహ కార్యక్రమం ఈసీఐ సౌత్ఆంధ్ర డయాసిస్ బిషప్ డాక్టర్ ఆర్ కె ఏబేలు నీలకంఠ చేత జరిగించబడింది. ఈ సందర్భంగా నూతన వధూవరులను ప్రత్యేక ప్రార్థన చేసి ఆశీర్వదించారు. -టీ నగర్ న్యూస్.



చెన్నై న్యూ ఆవడి రోడ్డులోని ఈసిఐ గాంధీ నగర్ బరాక తెలుగు చర్చి సభ్యురాలు పవిత్రమ్మ 50వ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం సాయంత్రం ఈసిఐ సౌత్ ఆంధ్ర డయాసిస్ బిషప్ ఆర్కే ఏబెల్ నీలకంఠ అధ్యక్షత ప్రత్యేక ప్రార్థన చేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పవిత్రమ్మను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జి జాకబ్, సంఘ పెద్దలు, కమిటీ సభ్యులు, స్త్రీల సమాజం, తదితరులు పాల్గొన్నారు. - **గిండి న్యూస్**




# అమ్మాయిల ఘనత: అండర్-19 టీ20 వరల్డ్ కప్‌ను రెండోసారి?

**చెన్నై:** భారత అండర్-19 మహిళల క్రికెట్ జట్టు మరోసారి చరిత్ర సృష్టించింది. అండర్-19 టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించి, వరుసగా రెండోసారి ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది. 2023లో తొలిసారి ఈ కప్ గెలిచిన భారత జట్టు, 2025లోనూ అదే జోరును కొనసాగించింది.

**సౌతాఫ్రికాను చిత్తు చేసిన భారత బౌలర్లు**

చెన్నై వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సౌతాఫ్రికా జట్టు మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే భారత బౌలర్ల ధాటికి సఫారీ జట్టు 20 ఓవర్లలో కేవలం 82 పరుగులకే కుప్పకూలింది. వాన్ వూరస్ట్ (23) మాత్రమే చిన్న ప్రయత్నం చేసినా, మిగతా బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో గొంగడి త్రిష 3, వైష్ణవి శర్మ 2, ఆయుషి శుక్లా 2, పరుణిక 2, షబ్నమ్ 1 వికెట్ తీశారు.

**త్రిష మెరుపు ఇన్నింగ్స్ -11.2 ఓవర్లలో విజయ లాంచనం**

కేవలం 83 పరుగుల స్వల్ప లక్ష్యం తుదిశ్వాసలో కూడా ఉత్కంఠ రేకెత్తించలేదు. ఓపెనర్ గొంగడి త్రిష (44)లి మెరుపు ఇన్నింగ్స్ ఆడుతూ, మరో ఓపెనర్ కమలిని (8) వెంటనే కోల్పోయినప్పటికీ వన్ డౌన్ బ్యాటర్ సనికా చాల్కేతో (26)లి కలిసి జట్టును గెలిపించింది. భారత్ కేవలం 11.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. త్రిష అద్భుత ప్రదర్శనకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

**అండర్-19 టీ20 వరల్డ్ కప్‌పై భారత్ గట్టి పట్టు**

భారత మహిళల అండర్-19 జట్టు వరుసగా రెండోసారి ప్రపంచ కప్ గెలిచి అరుదైన ఘనత సాధించింది. 2023లో ఇంగ్లాండ్‌ను ఓడించి టైటిల్ దక్కించుకున్న భారత్, ఈసారి సౌతాఫ్రికాను మట్టికరిపించింది. యువ భారత క్రికెటర్ల శక్తిమంత మైన ప్రదర్శన, సమర్థమైన కోచింగ్ ఈ విజయాలకు కారణమని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. ఈ విజయంతో భారత మహిళల క్రికెట్ భవిష్యత్తు మరింత వెలుగొందనుందని అభిమాను లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



# కర్ణాటక 'చివరి మావోయిస్టు' లక్ష్మీ లొంగుబాటు

కర్ణాటక మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారిందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్రంలో చివరి మావోయిస్టుగా భావిస్తోన్న లక్ష్మీ.. పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఉడుపి పోలీసు ఉన్నతాధికారుల ముందు సరెండరైన ఆమె.. ఆర్థిక సాయం అందించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. లక్ష్మీ స్వగ్రామం కుందపుర తాలుకాలోని మచ్చట్టు. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం కుటుంబాన్ని విడిచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. అనంతరం నక్సలైట్ అజెండాతో పనిచేయడం ప్రారంభించింది. సమీప ప్రాంతాల్లో మావోయిస్టు సాహిత్యం ప్రచారం చేయడంతోపాటు పోలీసులపై దాడి ఘటనలతో ఆమెపై గతంలో మూడు కేసులు నమోదయ్యాయి. చాలా ఏళ్లుగా ఏపీలో తలదాచుకున్నట్లు సమాచారం. ఇటీవల లొంగిపోవాలని నిర్ణయించుకున్న లక్ష్మీ.. సరెండర్ కమిటీ సభ్యుడు, గతంలో లొంగిపోయిన ఆమె భర్త సలీంతో కలిసి ఉడుపి పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యారు.



రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సరెండర్ కమిటీ ఏర్పాటు చేసింది. దీంతో లొంగిపోయే వారికి మార్గం సుగమం కావడంతో ఇటీవల అనేక మంది మావోలు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. రెండురోజుల క్రితమే శృంగేరి తాలూకా కిగ్గా గ్రామానికి చెందిన మావోయిస్టు నాయకుడు రవీంద్ర నెమ్మార్ చిక్కమగళూరులో అధికారుల ముందు లొంగిపోయాడు. రాష్ట్రాన్ని మావోయిస్టు రహితంగా మార్చేందుకు కృషి చేసిన 22 మంది పోలీసు అధికారుల బృందానికి చీఫ్ మినిస్టర్ మెడల్ ఇవ్వనున్నట్లు సీఎం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.

# "నిజమైన దేశభక్తి అంటే ప్రజల పట్ల ప్రేమ"



**చెన్నై న్యూస్:** భారతీయ శరణ-స్కౌట్ ఉద్యమం వజ్రోత్సవాలు మరియు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతాబ్ది ఉత్సవాలు తిరుచ్చి జిల్లా మనప్పారైలోని సిప్‌కాట్ కాంప్లెక్స్‌లో "జంపురి" పేరుతో జరుగుతున్నాయి. ఈ సదస్సుకు భారతదేశంలోని 25 రాష్ట్రాలు మరియు 4 విదేశాల నుండి సుమారు 20,000 మంది స్కౌట్స్ మరియు గైడ్స్ హాజరవుతున్నారు. ఈ ఉత్సవాన్ని తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ జనవరి 28న ప్రారంభించారు.

ఈ ఉత్సవంలో పాల్గొనే విద్యార్థులు, తమ రాష్ట్ర కళలు, సంస్కృతి ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు, జట్టు మరియు వ్యక్తిగత నైపుణ్య పోటీలు నిర్వహించడం ద్వారా తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. అంతేగాక, వివిధ సాహస కార్యకలాపాల్లో కూడా పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు పాఠశాల విద్యా మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యమొళి, తిరుచ్చి జిల్లా కలెక్టర్ ప్రదీప్ కుమార్, ఇతర ప్రధాన అధికారులు పాల్గొని స్కౌట్స్‌ను ప్రోత్సహించారు.

### ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్

ఉత్సవం ముగింపు కార్యక్రమాలు ఈరోజు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ప్రత్యేక అతిథిగా హాజరై ప్రసంగించారు.

**ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ప్రసంగ విశేషాలు**

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "తమిళనాడు స్కౌట్ ఉద్యమానికి రూ. 10 కోట్ల వ్యయంతో ఆధునిక శిక్షణా సౌకర్యాలతో కొత్త ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయబడుతుంది."
- "నిజమైన దేశభక్తి అంటే ప్రజల పట్ల ప్రేమ. దేశభక్తి ప్రేమకు మించి ఉండాలి."
- "భూమిపై ప్రజల పట్ల ప్రేమగా ఎదగండి. మానవతా తత్వశాస్త్రంతో, మనమందరం మానవులమే అనే విశాల హృదయం కలిగి ఉండాలి."
- తమిళనాడు విద్యా రంగం గొప్ప ఖ్యాతిని తెచ్చుకుంది. ముఖ్యంగా 'ఇల్లం తేడి కల్వి' ప్రాజెక్టు విజయవంతంగా అమలు చేయడంలో మంత్రి అన్బిల్ మహేష్ గొప్ప పాత్ర పోషించారు. పాఠశాల విద్యా శాఖ ఆయన నాయకత్వంలో అద్భుతంగా పనిచేస్తోంది. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడానికి, ఉత్తీర్ణత రేటును మెరుగుపరచడానికి 'హోమ్ సెర్చ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్' ముఖ్య భూమిక పోషించింది.
- ఇటీవల నీతి ఆయోగ్ నివేదికలో, తమిళనాడు 17 లక్ష్యాల్లో అగ్రస్థానాన్ని దక్కించుకుంది.
- మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ఆధునిక తమిళనాడుకు సృష్టికర్త. సమానత్వం, సమాజ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిది.

## లైంగిక వేధింపుల కేసు : నిందితుడికి జ్యుడీషియల్ కస్టడీ

**చెన్నై:** చెన్నైలోని గిండీ అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఘటన తీవ్ర సంచలనాన్ని రేపింది. ఈ కేసులో కొత్తూరుపురానికి చెందిన జ్ఞానశేఖరన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తు చేస్తోంది. నిందితుడిని ఫిబ్రవరి 7 వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపాలని సైదాపేట క్రిమినల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశించింది. ఈ ఘటనపై ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి స్పందిస్తూ, "కేసును సీబీఐకి బదిలీ చేయాలని" డిమాండ్ చేశారు. తన X (ట్విట్టర్) పోస్ట్‌లో, "అన్నా యూనివర్సిటీ క్యాంపస్ లైంగిక వేధింపుల కేసును SIT దర్యాప్తు చేస్తుండగా, అనేక మంది జర్నలిస్టులను విచారణ కోసం పిలిపించి, వారి ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు నివేదికలు వచ్చాయి" అని పేర్కొన్నారు. "ఎఫ్ఐఆర్ లీక్ పూర్తిగా ప్రభుత్వ తప్పు. దానిని జర్నలిస్టులపై




మళ్లించే ప్రయత్నం ఖండించదగినది."

"తమిళనాడు ప్రభుత్వం ఈ కేసుపై ఒత్తిడి తెస్తుందా? హైకోర్టు నియమించినా, దర్యాప్తు అధికారులపై రాష్ట్ర ప్రభావం ఉందా?" అంటూ ప్రశ్నించారు. "నిర్బంధితుడు ఎవరన్న ప్రశ్నకు సమాధానం లభించేలా, బాధితురాలు న్యాయం పొందేలా ఈ కేసు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలి" అని పళనిస్వామి అన్నారు.

## తన కాళ్లకు కాదు... పేద పిల్లల భవిష్యత్తుకు వెలుగునిచ్చే బూట్లు!




**అన్నా నగర్ న్యూస్ :** ఉతుక్కోట్టైలోని అన్నా విగ్రహం వద్ద, పేద పిల్లల విద్య కోసం తన బూట్లు శుభ్రం చేసుకున్న గొప్ప మనసుకల వ్యక్తి సెల్వకుమార్ మదర్ థెరిసా. చెన్నైలోని పడియనల్లూరులో 23 ఏళ్ల వయసులో ఓ పాఠశాలను స్థాపించిన ఆయన, గత 21 సంవత్సరాలుగా నిరుపేద మరియు తండ్రిలేని పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్నారు. సెల్వకుమార్ అసిస్టెంట్ తమిళ ప్రొఫెసర్‌గా పనిచేసినప్పటికీ, తన ఖాళీ సమయాన్ని గ్రామగ్రామాన తిరుగుతూ బహిరంగ ప్రదేశాల్లో బూట్లు శుభ్రం చేయడంలో గడుపుతున్నారు. ఈ విధంగా పిల్లల విద్య కోసం నిధులు సమీకరించడం ఆయన జీవన విధానం. తాజాగా, ఉతుక్కోట్టై అన్నా విగ్రహం వద్ద తన బూట్లు తుడుచుకుని రూ. 3,250 సంపాదించారు. ఈ మొత్తం తన పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి కిరాణా సామాను కొనుగోలుకు వినియోగించారు. అతని సేవా ధనం, నిస్వార్థ పరమార్థం ఎందరికో ఆదర్శం!

## 4న తెలంగాణ అసెంబ్లీ .. సభ ముందుకు కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలు

**హైదరాబాద్:** ఫిబ్రవరి 4న తెలంగాణ అసెంబ్లీ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈమేరకు శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులు ప్రకటన జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు .. ఉదయం 10గంటలకు కేబినెట్ భేటీ జరగనుంది. ఈ సమావేశంలో.. బీసీ సబ్ కమిటీ కులగణన నివేదిక, ఎస్సీ వర్గీకరణపై ఏక సభ్య కమిషన్ నివేదికను క్యాబినెట్‌కు అందజేస్తారు. కులగణన నివేదిక, ఎస్సీ వర్గీకరణపై చర్చించి మంత్రివర్గం నిర్ణయం తీసుకుంటుంది. క్యాబినెట్ సమావేశం అనంతరం 11 గంటలకు అసెంబ్లీ, మండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. శాసనమండలి, శాసనసభలో ఈ రెండు నివేదికలను ప్రవేశ పెట్టి చర్చిస్తారు.



కాట్పడి గాంధీ నగర్ లోని దివ్యం ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు ఇందులో గొంతు నొప్పి కాలనొప్పి మోకాళ్ల అరచేతుల నొప్పులు మోకాలు మోకాలు అరుగుట తదితర సమస్యల నివారణ కోసం వైద్యులు సలహాలు సూచనలు ఇవ్వడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు ఈ కార్యక్రమంలో దివ్యం ఆసుపత్రి డాక్టర్ రవిచంద్రన్ డాక్టర్ కిషోర్ డాక్టర్ చంద్రమేనా ప్రియా వైద్యులు నర్సులు తదితరులు పాల్గొన్నారు **(వేలూరు)**

## విజయవాడలో సందడి చేసిన మాజీ క్రికెట్ జాంటీ రోడ్స్

**విజయవాడ:** దక్షిణాఫ్రికాకు చెందిన మాజీ క్రికెటర్ జాంటీ రోడ్స్ విజయవాడలో సందడి చేశారు. ఏ రంగంలో అయినా రాణించాలంటే.. మనపై మనకు నమ్మకం ఉండాలని, ఆ తర్వాత కష్టంతో పాటు, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికలు ఉండాలని అందరిలో ఉత్తేజం నింపే ప్రయత్నం చేశారు. విజయవాడలో ఏపీ బీఎన్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా కాంక్లేవ్ 3.0కు జాంటీ రోడ్స్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఏపీ, తెలంగాణ, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, కోల్‌కతా నుంచి సుమారు 1500 మంది వ్యాపారవేత్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాంటీ రోడ్స్ వ్యాపారవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఏ వ్యాపారమైనా వినియోగదారుల్లో నమ్మకం కలిగించాలని, దానిని నిరంతరం కొనసాగిస్తే ఇక తిరుగుండదన్నారు. తాను క్రికెటర్ అవుదామని నిర్ణయం తీసుకుని అడుగులు వేసే సమయంలో ఎన్నో అడ్డంకులు వచ్చినా నిలబడ్డానని చెప్పారు. చేసే పనిపైన శ్రద్ధ, లక్ష్యాలు సాధించాలనే తపన ఉండాలని వివరించారు. ఎన్నో ఆటుపోట్లు ఉంటాయని, వాటిని తట్టుకుని నిలబడాలని.. లోపాలు సరి చేసుకుంటూ ముందుకు సాగితే విజయాలు వరిస్తాయని వ్యాపారవేత్తల్లో ఉత్తేజాన్ని నింపారు.



మహాత్మా గాంధీ వర్ధంతి దినోత్సవం పురస్కరించుకుని వేలూరు కోట మైదానంలో ఉన్న గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మాజీ కార్పొరేటర్ పిపి చంద్ర ప్రకాష్ అధ్యక్షతన పూలమాలవేసి నివాళులర్పించారు ఆయనతోపాటు పార్టీ ఐ ఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అలీ జిన్నా పార్టీ కార్యకర్తలు ఉన్నారు **-వేలూరు**





# వేలూరులో శ్రీశాంతి గురుదేవ్ మహారాజ్ అవరోహన దినోత్సవం

**వేలూరు న్యూస్:** వేలూరు పట్టణంలో మేరీ కాళియమ్మన్ ఆలయ వీధిలోని శ్రీ శాంతి గురుదేవ్ మహారాజ్ 185వ జయంతి దినోత్సవంతో పాటు 120 అవరోహణ దినోత్సవ. కార్యక్రమం ఆదివారం ఉదయం జరిగింది. ముందుగా మెయిన్ బజారు నుంచిజెండాను ఎగరవేసి ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం గాంధబు రోడ్డు, శెట్టివీధితదితర వీధుల్లో ఊరేగింపు జరిగింది. ఇందులో కర్ణాటక, రాజస్థాన్, చత్తీస్గడ్ వంటిరాష్ట్రాలకు చెందిన జైన్ మతస్తులు నృత్యం చేయడంతో పాటు పాటలు పాటడిఆకట్టుకున్నారు. అనంతరం వృద్ధాశ్రమం, అనాథ ఆశ్రమాల్లో అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో శ్రీ గురుదేవ్ భక్త మండలి అధ్యక్షులు శ్రీశాంతిలాల్ కులేచా, కార్యదర్శి విజయకుమార్ కటారియా, కోశాధికారి దినేష్ కుమార్ భట్టేవాడ, శ్రీశాంతి మండలిఅధ్యక్షులు విజయకుమార్, కార్యదర్శి దిలీఫ్ కులేచ, కోశాధికారి పూనం కులేదా,ఆర్గనైజర్ సుభాష్ జైన్ పత్వేద తదితరులు పాల్గొన్నారు.



## సూర్యుడికి అర్ఘ్యం ఎందుకు?



కొందరు ప్రతిరోజూ పొద్దున్నే స్నానమాచరించాక సూర్యభగవానుడికి అర్ఘ్యం సమర్పిస్తుంటారు. ఏదయినా పాత్ర నిండా నీటిని తీసుకుని సూర్యుడి ఎదురుగా నిల్చుని ధారలా వదులుతారు. అనాదిగా పాటిస్తున్న ఈ సంప్రదాయం వెనుక ఆరోగ్య రహస్యాలు దాగున్నాయి. ఇలా అర్ఘ్యం సమర్పిస్తున్నప్పుడు ఆ నీటి ద్వారా సూర్యుడి లేలేత కిరణాలు మన కళ్లతోపాటు శరీరంపైనా పడతాయి. తద్వారా కంటిచూపు మెరుగవుతుందట. అర్ఘ్యం అర్పిస్తూ కాసేపైనా సూర్యుడి ఎదురుగా నిల్చోవడం వల్ల శరీరానికి విటమిన్ డి సమృద్ధిగా అందుతుంది. పరోక్షంగా చెప్పాలంటే... సూర్యుడి నుంచి అందే ప్రాణశక్తినీ వెలుగునూ నిత్యం ఉపయోగించుకుంటున్నందుకు కృతజ్ఞతగానే ప్రత్యక్ష నారాయణుడికి అర్ఘ్యం సమర్పించే ఆచారం ఆచరణలోకి వచ్చిందని చెబుతారు.

## హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు

**నంద్యాల:** త్వరితగతిన కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఆదివారం నంద్యాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అనువైన భవనాన్ని ఎంపిక చేసేందుకు ఈ నెల 6న హైకోర్టు జడ్జిల బృందం కర్నూలుకు వస్తున్నట్టు మంత్రి చెప్పారు. కర్నూలు దిన్నె దేవరపాడు వద్ద ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు చెందిన భవనాన్ని బృందం పరిశీలించనున్నట్టు తెలిపారు. బెంచ్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి వివరించారు.

## రోడ్డు ప్రమాదం.. నలుగురి మృతి

**నగరి:** చిత్తూరు జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తిరుపతి- చెన్నై రహదారిలో లారీ, బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో 14 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి మృతుల వివరాలు సేకరిస్తున్నారు.

## పార్లమెంటులో ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ'.. సినిమా ప్రదర్శన

పార్లమెంట్ అరుదైన సందర్భానికి వేదిక కానుంది. ఈ నెల 15న 'రామాయణం: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ' సినిమాను పార్లమెంటులో ప్రదర్శించనున్నారు. గీక్ పిక్చర్స్ ఇండియా ఈ విషయాన్ని వెల్లడించింది.

'రామాయణం: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ చిత్రాన్ని ఫిబ్రవరి 15న పార్లమెంటులో ప్రదర్శించనున్నాం. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, పార్లమెంటు సభ్యులతో పాటు పలువురు ప్రముఖులు సైతం దీనికి హాజరుకానున్నారు. ఇది మాకు ఎంతో స్ఫూర్తినిస్తుంది' అని గీక్ పిక్చర్స్ ఇండియా సహ వ్యవస్థాపకులు అర్జున్ అగర్వాల్ ఓ ప్రకటనలో తెలిపారు.

1993లో 'రామాయణం: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ' యానిమేటెడ్ చిత్రాన్ని రూపొందించారు. 24వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో దీన్ని ప్రదర్శించారు. అయితే కొన్ని కారణాల




వల్ల అప్పుడు థియేటర్‌లలో ప్రదర్శించలేకపోయారు. 2000 సంవత్సరంలో టీవీలో దీన్ని టెలికాస్ట్ చేయగా ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. దీంతో దీని 4కే వెర్షన్‌ను సిద్ధం చేసి జనవరి 10న రిలీజ్ చేశారు. గీక్ పిక్చర్స్ఇండియా, ఏఏ ఫిల్మ్స్ సంయుక్తంగా దీన్ని నిర్మించాయి. రామ్ మోహన్, యుగో సాకో దర్శకత్వం వహించిన ఈ యానిమేటెడ్ చిత్రానికి విజయేంద్రప్రసాద్ రైటర్‌గా వర్క్ చేశారు.

